ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 15.04.2026 సమయం. 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. హైదరాబాద్ లో మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతుగా బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఈరోజు భారీ స్కూటీ ర్యాలీ నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో తీసుకురానున్న నారీ శక్తి వందన్ అధీనియం ఒక చారిత్రక మైలురాయని బీజేపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ప్రశంసించారు.

2. ఖమ్మం జిల్లా పులిగుండాల ఎకో టూరిజం ప్రాజెక్టును భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఈరోజు ప్రారంభించారు.

3. నిరుద్యోగులకు టామ్ కాం సంస్థ ద్వారా జర్మనీలో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు.

4. మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు ప్రతిష్టను దిగజార్చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు ఆరోపించారు.

**RALLY:**

33 శాతం మహిళా రిజర్వేషన్ విధానానికి మద్దతుగా బీజేపీ మహిళా మోర్చా, యువ మోర్చా ఆధ్వర్యంలో భారీ స్కూటీ ర్యాలీ నిర్వహించారు. హైదరాబాద్ లోని నారాయణగూడలో ఉన్న కేశవ్ మెమోరియల్ వద్ద బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు ఈ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో తీసుకురానున్న **నారీ**

**శక్తి వందన్ అధీనియం** ఒక చారిత్రక మైలురాయి అని ఆయన ప్రశంసించారు. దశాబ్ద కాలంగా ఈ బిల్లును పెండింగ్ లో ఉంచిన కాంగ్రెస్ పార్టీ తీరును రామచందర్ రావు తప్పుపట్టారు. అలాగే నియోజకవర్గాల పునర్విభజన విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలకు ఎప్పుడు అన్యాయం జరగదని, సమాన ప్రాధాన్యత ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రజలు విభజన రాజకీయాలను తిరస్కరించాలని, పాలనలో లింగ సమానత్వం కోసం తీసుకున్న ఈ గొప్ప నిర్ణయాన్ని స్వాగతించాలని రామచందర్ రావు కోరారు.

**DESK**

**భట్టి విక్రమార్క**

ఖమ్మం జిల్లా, బ్రాహ్మాళ్లకుంట పరిధిలోని పులిగుండాల ఎకో టూరిజం ప్రాజెక్టును భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డితో కలిసి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ... రాష్ట్రంలోని అపురూపమైన ప్రకృతి సంపదను ప్రపంచానికి పరిచయం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, పులిగుండాలను ఉత్తమ పర్యాటక కేంద్రాలలో ఒకటిగా నిలబెడతామని అన్నారు. పర్యాటకుల రాకపోకలకు వీలుగా ఇక్కడికి వెళ్లే మార్గాన్ని వెంటనే రెండు లైన్ల రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. కనకగిరి హిల్స్ అభివృద్ధికి తక్షణమే కార్యాచరణ ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ నుంచి పులిగుండాలకు నీటిని మళ్లించే సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేస్తామని హామీ ఇచ్చారు.

పిటిసి, ఖమ్మం

**AICC:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మధ్య రాష్ట్ర స్థాయిలో వివిధ కార్పోరేషన్ల ఛైర్మన్ల నియామకాలపై నాలుగు గంటల పాటు జరిగిన సుధీర్ఘ చర్చలు ముగిశాయి. ఈ భేటీలో ఏఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కూడా పాల్గొన్నారు. దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు మరో రెండు రోజుల్లో వెలువడే అవకాశం ఉంది. టీపీసిసి

వర్కింగ్ ప్రెసిడెంట్లు, సెక్రటరీలు, మండల స్థాయి కమిటీల నియామకాలపై కూడా నేతలు చర్చించారు. కేవలం పార్టీ సంస్థాగత మార్పులే కాకుండా కేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను ఎలా ఎదురుకోవాలి అనే వ్యూహాలపై కూడా చర్చించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడంతో పాటు పరిపాలన యంత్రాంగాన్ని మరింత పటిష్టం చేయడంపై ఈ ఉన్నతస్థాయి సమావేశం దృష్టి సారించింది.

**DESK**

**PONNAM:**

రహదారి నిబంధనలు పాటించడం కేవలం చట్టం కోసం కాదని, అది మన ప్రాణాలకు రక్షణ కవచమని రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈరోజు ఆదిలాబాద్ జిల్లాలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలనా- ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన అరైవ్ అలైవ్, రహదారి భద్రత అవగాహన సదస్సులో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ… ట్రాఫిక్ నియమాలపై సమాజంలో అవగాహనా పెంపొందించడంలో విద్యార్థుల పాత్ర కీలకమన్నారు. సహజ మరణాల కంటే రహదారి ప్రమాదాలతోనే ఎక్కు మంది మరణిస్తున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.

**PTC, NRML**

**వివేక్ వెంకటస్వామి**

నిరుద్యోగులకు టామ్ కాం సంస్థ ద్వారా జర్మనీలో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆకాశవాణితో మాట్లాడుతూ… ప్రతి సంవత్సరం జర్మనీలో 90 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. కేవలం ఉద్యోగాలే కాకుండా, రైతులకు ఉపయోగపడేలా భూసార పరీక్షలు, పంట మార్పిడి వంటి అంశాలపై సరికొత్త ఆవిష్కరణలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని మంత్రి పేర్కొన్నారు.

సౌండ్ బైట్ ... వివేక్ వెంకటస్వామి

పిటిసి, మంచిర్యాల

**BRS:**

మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు ప్రతిష్టను దిగజార్చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీగా అప్పులు చేస్తున్నారని, దీనిపై ప్రజలు ఆయనను నిలదీయాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు పిలునిచ్చారు. మేడ్చల్ జిల్లా, పిర్జాదీగూడలో పలువురు కాంగ్రెస్ మున్సిపల్ కౌన్సిలర్లు బీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలను, రాజకీయ ఉద్దేశ్యాలను తీవ్రంగా విమర్శించారు. ఉప్పల్ ఫ్లై ఓవర్ పనులు నిలిచిపోవడాన్ని కేటిఆర్ తప్పుపట్టారు. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగితే చంద్రశేఖరరావు నేతృత్వంలో దేశ వ్యాప్తంగా నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

**DESK**

**MULUGU**

సురక్షిత ప్రయాణమే కుటుంబానికి భరోసా ఇస్తుందని, వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏటూరు నాగారం లోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "అరైవ్ - అలైవ్" కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ... అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి పనుల వల్ల కలిగే అనర్థాలతో కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని, ప్రతి ఒక్కరూ సురక్షితంగా ప్రయాణం చేయాలని అన్నారు.

పిటిసి, ములుగు

**హుండీ లెక్కింపు - భద్రాద్రీ**

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయ హుండీలను ఈరోజు లెక్కించారు. హుండీల ద్వారా ఒక కోటి 56 లక్షల ఆదాయం లభించిందని ఆలయ ఈవో దామోదర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. నగదుతో పాటు 71 గ్రాముల బంగారం, 1,280 గ్రాముల గ్రాముల వెండితో పాటు విదేశాలకు చెందిన కరెన్సీని కూడా భక్తులు స్వామి వారికి సమర్పించినట్లు ఈవో తెలిపారు.

పిటిసి, భద్రాద్రీ కొత్తగూడెం

**RABI:**

నల్గొండ జిల్లాలోని, కొండభీమనపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ లు ప్రారంభించారు. యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఎటువంటి అడ్డంకులు లేకుండా సాగాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ధాన్యాన్ని జాప్యం లేకుండా వెంటనే కొనుగోలు చేయాలన్నారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన త్రాగునీరు, షెడ్లు, తేమను పరీక్షించే యంత్రాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

**DESK**

**NALGONDA:**

2027 జాతీయ జనగణనలో భాగంగా డిజిటల్ సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియ ప్రారంభమవుతున్నట్లు నల్గొండ జిల్లా యంత్రాంగం ప్రకటించింది. ఈ ప్రక్రియ ఈనెల 26 నుంచి మే 10వ తేదీ వరకు కొనసాగుతుంది. ఈ ఆధునిక విధానంలో భాగంగా జియో ట్యాగింగ్ ను తప్పనిసరి చేశారు. దీని ద్వారా నివాసితులు డిజిటల్ మ్యాప్ లో తమ ఇంటిని ఖచ్చితంగా గుర్తించవచ్చు. ఇది హౌస్ లిస్టింగ్ బ్లాక్ మ్యాపింగ్ ను మరింత సులభతరం చేస్తుంది. డేటా ఖచ్చితత్వం కోసం ప్రభుత్వ ఉద్యోగులు, సాధారణ ప్రజలు 20 నిమిషాల నిడివి గల ఈ ఆన్ లైన్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు కోరారు.

**DESK**

**JANGAON:**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఎటువంటి లోపాలు లేకుండా నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు. ఈరోజు జిల్లాలోని దేవరుప్పుల, కొడకండ్ల, మొండ్రాయి గ్రామ పంచాయతీలో కొనసాగుతోన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్మాణాల్లో నాణ్యత, పురోగతి, సౌకర్యాల అమలు వంటి అంశాలను సవివరంగా అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

PTC, JGN

**KGBV-RS:**

ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన రాజన్న సిరిసిల్ల జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థిని లను కలెక్టర్ గరిమ అగర్వాల్ అభినందించారు. ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం ఫలితాలలో, జిల్లాలోని ప్రథమ సంవత్సరంలో సిరిసిల్ల **KGBV** విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు.

**PTC, RS**

**NIZAMABAD:**

జిల్లాలోని ఏ ఒక్క ప్రాంతంలోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు కావాల్సిన అన్ని పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు.

**PTC, NZB**

**గుత్తా సుఖేందర్ రెడ్డి**

జనాభా ప్రకారం డీలిమిటేషన్ జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందనీ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆరోపించారు. నల్లగొండలో మీడియాతో మాట్లాడుతూ... దేశంలో జమిలీ ఎన్నికలు జరిగితే 18 రాష్ట్రాలు ఒకసారి, మిగిలిన రాష్ట్రాలు ఒకసారి ఎన్నికలకు వెళ్ళే అవకాశం ఉందని అన్నారు.

పిటిసి, నల్గొండ